# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

## విశాఖపట్నం కేంద్రం

## ప్రాంతీయ వార్తలు

తేదీ: 18-11-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు కీలక బిల్లులకు ఆమోదం లభించింది.
- ❖ పౌర విమానయాన రంగంలో మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు పేర్కొన్నారు.
- ❖ తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సర్వదర్శనానికి వచ్చే భక్తులకు 2 నుంచి 3 గంటల్లోగా దర్శనం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు.
- ❖ రాయలసీమలో కుల వ్యవస్థ, అసమానతలపై తన కీర్తనల ద్వారా ప్రజలను చైతన్యపరిచిన భక్త కనకదాసకు అసెంబ్లీలో మంత్రులు నివాళులు అర్పించారు.
- ❖ గిరిజన సహకార సంస్థ (జీసీసీ) నూతన ఛైర్మన్ గా కిడారి శ్రావణ్ కుమార్ ఈరోజు బాధ్యతలు స్వీకరించారు.

========================

ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా ఈరోజు కీలక బిల్లులకు ఆమోదం లభించింది. ఏపీ పంచాయతీరాజ్ సవరణ బిల్లు-2024, ఏపీ ల్యాండ్ గ్రాబింగ్ నిరోధక బిల్లు, ఏపీ సహకార సంఘం సవరణ బిల్లులకు శాసనసభ ఆమోదం తెలిపింది. అలాగే ఎన్టీఆర్ హెల్ వర్సిటీ సవరణ బిల్లు-2024, ఆయుర్వేదిక్ హోమియోపతి మెడికల్ ప్రాక్టిషనర్స్ చట్ట సవరణ, ఏపీ మెడికల్ ప్రాక్టిషనర్స్ రిజిస్ట్రేషన్ చట్ట సవరణ బిల్లు-2024 బిల్లులను కూడా శాసనసభ ఆమోదించింది. అనంతరం శాసన సభాపతి అయ్యన్న పాత్రుడు సభను రేపటికి వాయిదా వేశారు.

========================

ఇకపై ఇద్దరి కంటే ఎక్కువ మంది పిల్లలున్నా పట్టణ స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం ఉంటుందని పురపాలక పట్టణాభివృద్ధి కార్యాలయం స్పష్టం చేసింది. జనాభా వృద్ధి రేటు పెంపుదలలో భాగంగానే చట్టంలో మార్పులు చేశామని ఒక ప్రకటనలో వెల్లడించింది. దీనికి సంబంధించి గతంలో ఉన్న చట్టాల్లో సవరణ చేస్తూ అసెంబ్లీ

ఆమోదం తెలిపింది. అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ చట్టాల సవరణ బిల్లు 2024కు అసెంబ్లీ ఆమోదం తెలిపింది. ఈ బిల్లును 4 రోజుల క్రితమే పురపాలక శాఖా మంత్రి నారాయణ సభలో ప్రవేశపెట్టారు. కాగా ఈరోజు బిల్లు ఆమోదం కోసం మంత్రి నారాయణ ప్రతిపాదించిన తర్వాత ఎలాంటి చర్చా లేకుండానే ఆమోదం పొందింది.

=========================

పౌర విమానయాన రంగంలో మహిళలకు ఉపాధి అవకాశాలు మెండుగా ఉన్నాయని పౌర విమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు అన్నారు. ఈరోజు శ్రీకాకుళం నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన విమానయాన రంగంలో మహిళల భాగస్వామ్యం సదస్సులో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... పౌర విమానయాన రంగంలో మహిళల ప్రాతినిధ్యం మరింత పెరగాలని ఆ మేరకు గ్రామీణ ప్రాంతాల మహిళలకు విమానయాన రంగంలో ఉన్న ఉపాధి అవకాశాలపై అవగాహన కల్పించేందుకు ఈ సదస్సు ఏర్పాటు చేశామని వివరిస్తూ...

(వాయిస్ 32 సెకన్లు)

అలాగే దేశంలో పౌరవిమానయాన రంగంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలిపేందుకు అన్ని విధాలా కృషి చేస్తున్నామని చెప్పారు. త్వరలో రాష్ట్రంలో ఉత్తరాంధ్ర జిల్లాల పరిధిలో ప్రపంచ స్థాయి పౌర విమానయాన విశ్వవిద్యాలయం ఏర్పాటు కానుందని రామ్మోహన్ నాయుడు తెలిపారు.

=========================

అరకు కాఫీ దేశంలోని అన్ని ప్రధాన నగరాల్లో లభించేలా ఫ్రాంచైజీలు ఏర్పాటు చేయనున్నామని గిరిజన సహకార సంస్థ నూతన చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్ ప్రకటించారు. ఈరోజు విశాఖపట్నంలో జిసిసి కార్యాలయంలో ఆయన చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భగా మాట్లాడుతూ... గిరిజన ఉత్పత్తులకు మరింత ప్రాచుర్యం కల్పిస్తామన్నారు. గిరిజన రైతులకు కనీస మద్దతు ధర లభించేలా చేయడం, పంట నష్టపోకుండా ఆదుకోవడం, దళారుల బెడద లేకుండా చేయడం జిసిసి ప్రధాన సూత్రాలని గుర్తు చేశారు. శ్రీకాకుళం జిల్లా సీతంపేట, పార్వతీపురం మన్యం జిల్లా కొమరాడలో గిరిజనులకు కొత్త పెట్రోల్ బంకుల ఏర్పాటుకు అనుమతులు మంజూరు చేశామన్నారు.

విరామం

=========================

నేటి యువత సామాజిక స్పృహ కలిగి ఉండటంతో పాటు ప్రశ్నించే తత్వాన్ని అలవరచుకోవాల్సిన అవసరం ఉందని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ నూతన చైర్మన్ కొమ్మారెడ్డి పట్టాభిరామ్ అన్నారు. తుమ్మలపల్లి కళాక్షేత్రంలో స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ చైర్మన్ గా ఈరోజు ఆయన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. చెత్త నుంచి సంపద తయారీతో పాటు విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటామన్నారు. స్వచ్ఛ భారత్ అభియాన్ ద్వారా కేంద్ర ప్రభుత్వం నుండి ఎక్కువ నిధులు వచ్చేలా కృషి చేస్తానన్నారు.

=========================

తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామి వారి సర్వదర్శనానికి వచ్చే భక్తులకు 2 నుంచి 3 గంటల్లోగా దర్శనం కల్పిస్తామని టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. తిరుమలలోని అన్నమయ్య భవనంలో ఈరోజు జరిగిన పాలకమండలి సమావేశం అనంతరం ఆయన పాత్రికేయులతో మాట్లాడుతూ... ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ సహకారంతో 20 నుండి 30 గంటల పాటు వేచి ఉండాల్సిన దర్శన సమయాన్ని తగ్గించేలా ప్రయత్నం చేస్తామన్నారు. మూడు, నాలుగు నెలల్లో తిరుమలలోని డంపింగ్ యార్డును తరలిస్తామని.. శ్రీనివాస సేతు ఫ్లై ఓవర్ పేరును గరుడవారధిగా మారుస్తున్నామన్నారు. అలాగే అవుట్ సోర్సింగ్ ఉద్యోగులను 7 వేల 530కి పెంచుతున్నామని చైర్మన్ వెల్లడిస్తూ...

(వాయిస్ 34 సెకన్లు)

=========================

సామాజిక తత్వవేత్త, సంగీత విద్వాంసులు, ఆధునిక కవి భక్త కనకదాస జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు మంత్రులు, శాసన సభ్యులు పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. అమరావతిలోని అసెంబ్లీ హాలులో కనకదాస జయంతిని ఈరోజు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కనకదాస జీవిత విశేషాలను, రాయలసీమలో కుల వ్యవస్థ, అసమానతలపై తన కీర్తనల ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చిన విధానాన్ని శాసన సభ్యులు స్మరించుకున్నారు.

=========================

=========================